65శాతం రిజర్వేషన్లకు బీహార్ అసెంబ్లీ ఆమోదం

పాట్నా, నవంబర్ 9: ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ కులాలకు ప్రస్తుతం కల్పిస్తున్న 50 శాతం రిజర్వేషన్లను 65 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు బీహార్ శాసనసభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వీటికి ఈడబ్ల్యూఎస్ కోటా 10 శాతం కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి పెరుగుతాయి. కొత్త బిల్లు ప్రకారం ఎస్టీల కోటా ఒక శాతం నుంచి రెండు శాతానికి, ఎస్సీల కోటా 16 నుంచి 20 శాతానికి పెరగనుంది. ఈబీసీల కోటా 18 నుంచి 25 శాతానికి, ఓబీసీల కోటా 12 నుంచి 15 శాతానికి పెరగనుంది. ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచారు. ఈ సందర్భంగా బీహార్ సీఎం నితీశ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం కూడా కుల గణనకు అంగీకరించి దేశవ్యాప్తంగా రిజర్వేషన్లను పెంచితే తాను సంతోషిస్తానన్నారు. తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

గుజరాత్ హైకోర్టులో కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

అహ్మదాబాద్ : గుజరాత్ హైకోర్టులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని నరేంద్రమోదీ విద్యార్హతలకు సంబంధించి గతంలో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును పునర్విచారణ జరపాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రధాని ఎంఏ డిగ్రీకి సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని గుజరాత్ యూనివర్సిటీకి కేంద్ర సమాచర కమిషన్ (సీఐసీ) ఇచ్చిన ఆదేశాన్ని జస్టిస్ వైష్ణవ్ రద్దు చేయడమే కాక, ఈ కేసులో పిటిషనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు రూ.25 వేల జరిమానా కూడా విధిస్తూ మార్చిలోనే తీర్పు చెప్పారు. దీనిపై కేజ్రీవాల్ రివ్యూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు జస్టిస్ వైష్ణవ్ గురువారం తీర్పు చెప్పారు.

బిల్లుల చెల్లింపునకు 8 శాతం కమీషన్

కర్ణాటక సర్కారుపై ప్రతిపక్షం ధ్వజం

బెంగళూరు : కర్ణాటకలో పెండింగ్ బిల్లులను చెల్లించడానికి అధికార కాంగ్రెస్ నేతలు కాంట్రాక్టర్ల నుంచి 8 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. ప్రభుత్వ వైఖరితో విసిగిపోతున్న కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేయడానికి ముందుకు రావడం లేదని బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం యెడియూరప్ప విమర్శించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బెంగళూరులో ఈ నెలాఖరులో మూడు రోజులపాటు ఆందోళన చేపడుతామని వెల్లడించారు.

బీజేపీతో టచ్‌లో 45 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు: కుమారస్వామి

బెంగళూరు: కర్ణాటకలో 45 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి సంచలన ప్రకటన చేశారు. ఇంటెలిజెన్స్ నివేదికను పేర్కొంటూ బుధవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ 136 సీట్లు గెలుచుకున్నప్పటికీ దురదృష్టవశాత్తు సీఎం, మంత్రులు జేడీఎస్ ఎమ్మెల్యేలను లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారు' అని ఆయన అన్నారు. క్యాబినెట్ మార్పులపై సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య నిందారోపణలు కొనసాగడం, సీఎం పదవిపై కొందరు నేతలు ఆశ పడిన నేపథ్యంలో కుమారస్వామి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.

పాక్ రేంజర్ల కాల్పుల్లో బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

జమ్ము : జమ్ముకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి పాకిస్థాన్ రేంజర్స్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. రామ్‌గఢ్ సెక్టార్‌లో బుధవారం రాత్రి భారత్ బోర్డర్ ఔట్‌పోస్టులు లక్ష్యంగా జరిపిన కాల్పుల్లో బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఒకరు మృతి చెందారు. గాయపడిన హెడ్ కానిస్టేబుల్ లాల్ ఫామ్ కిమా(50)ను జమ్ములోని జీఎంసీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించారు.

డిసెంబర్ 4-22 వరకు పార్లమెంట్

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 9: పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూలు ఖరారైంది. డిసెంబర్ 4 నుంచి 22 వరకు ఈ సమావేశాలు జరుగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ఎక్స్‌లో తెలిపారు. 19 రోజుల్లో 15 సెషన్లలో సమావేశాలు సాగుతాయన్నారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వివాదానికి సంబంధించి ఎథిక్స్ కమిటీ నివేదిక, ఐపీసీ స్థానంలో తెచ్చిన మూడు బిల్లులపై స్టాండింగ్ కమిటీ నివేదికలు, ఇతర అంశాలను లోక్‌సభలో ప్రవేశపెడతామన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే పరిశీలిస్తారని మంత్రి తెలిపారు.

11 కోట్ల పాన్‌కార్డులు డీ యాక్టివేట్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డులతో అనుసంధానించని 11.5 కోట్ల పాన్‌కార్డులను కేంద్రం డీ యాక్టివేట్ చేసింది. ఆర్టీఐ విచారణలో ఈ విషయం వెల్లడైంది. 'ది హిందూ' ప్రచురించిన కథనం ప్రకారం ఇండియాలో మొత్తం 70.24 కోట్ల పాన్ కార్డులుండగా అందులో 13 కోట్ల కార్డులు ఆధార్‌తో లింక్ కాలేదు. 2017 జూలై 1 తర్వాత జారీ చేసిన పాన్ కార్డులు మాత్రం ఆటోమేటిగ్గా ఆధార్‌తో లింక్ అవుతాయి. డీ యాక్టివేట్ అయిన కార్డులను రీ యాక్టివేట్ చేసుకోవడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు రూ.1000 జరిమానాగా విధించింది. ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ ఈ విషయాన్ని విమర్శించారు. కొత్త పాన్‌కార్డు పొందడానికి రూ.91 ఖర్చవుతున్నప్పుడు దానికి పది రెట్లు ఎక్కువ మొత్తాన్ని రీ యాక్టివేట్ కోసం కేంద్రం జరిమానాగా విధిస్తున్నదన్నారు.

వర్జీనియా సెనేటర్‌గా హైదరాబాదీ

వరుసగా మూడోసారి ఎన్నికైన ఘజాలా హష్మీ

వాషింగ్టన్, నవంబర్ 9: హైదరాబాద్‌కు చెందిన ఘజాలా హష్మీ అమెరికాలోని వర్జీనియా స్టేట్ సెనేట్‌కు వరుసగా మూడో సారి ఎన్నికయ్యారు. ఆ రాష్ట్రంలో చట్ట సభకు ఎన్నికైన మొదటి ఇండియన్-అమెరికన్, ముస్లిం మహిళగా ఆమె ఇప్పటికే చరిత్ర సృష్టించారు. తన గెలుపుపై ఆమె మాట్లాడుతూ, 'గత నాలుగేండ్లుగా ఇక్కడ చాలా బాగా పనిచేశాం. ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. ఓటర్లు, మద్దతుదారులు నాపై ఉంచిన విశ్వాసానికి ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడివారి ఉజ్వల భవిష్యత్తు కోసం మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని అన్నారు. కాగా, అమెరికాలో స్థానిక, రాష్ట్ర చట్ట సభలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో మొత్తం 10 మంది ఇండియన్ అమెరికన్లు ఎన్నికయ్యారు.

మహువాపై వేటు!

- లోక్‌సభ నుంచి బహిష్కరించాలని నైతిక విలువల కమిటీ సిఫారసు
- 6:4 మెజారిటీతో నివేదికకు ఆమోదం
- తదుపరి చర్యల కోసం స్పీకర్‌కు నివేదిక
- పక్షపాత ధోరణి: కమిటీలోని విపక్ష సభ్యులు
- అదానీపై ప్రశ్నించినందుకే వేధింపులు: టీఎంసీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యే అవకాశం ఉన్నది. లోక్‌సభ నుంచి ఆమెను బహిష్కరించాలని బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోన్‌కర్ నేతృత్వంలోని నైతిక విలువల కమిటీ సిఫారసు చేసింది. మహువాపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి రూపొందించిన నివేదికను 6:4 మెజారిటీతో కమిటీ గురువారం ఆమోదించింది. ఈ నివేదికను లోక్‌సభలో ప్రవేశపెట్టి ఓటింగ్ చేపట్టనున్నారు. ఎంపీపై బహిష్కరణ వేటు వేయాలని ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేయడం ఇదే మొదటిసారని లోక్‌సభ మాజీ జనరల్ సెక్రటరీ ఆచార్య తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మహువా మొయిత్రా పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

పక్షపాత ధోరణి..

సమావేశం అనంతరం కమిటీలోని ప్రతిపక్ష ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ, నివేదికలో సిఫారసులు పక్షపాత ధోరణిలో ఉన్నాయని మండిపడ్డారు. అదానీ వ్యవహారంలో మోదీ సర్కార్‌ను ప్రశ్నించిన వారిపై కేంద్రం వేధింపులకు దిగుతున్నదని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. ఈ పోరాటంలో ఆమెకు పార్టీ అండగా నిలబడుతుందన్నారు.

ఆమోదానికి ముందే బయటకు..

ఎథిక్స్ కమిటీ ఆమోదించడానికి ముందే నివేదికలోని అంశాలు బయటకు రావటం సంచలనం రేపింది. మొయిత్రా ఎంపీ సభ్యత్వంపై వేటు వేసేలా కమిటీ సిఫారసు చేయబోతున్నదంటూ ఓ ప్రైవేట్ న్యూస్ చానల్‌లో బుధవారం వార్తా కథనం ప్రసారమైంది. దీనిపై మహువా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

భారీ మెజార్టీతో మళ్లీ అడుగుపెడతా: మహువా

తనను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తే తిరిగి భారీ మెజార్టీతో గెలిచి సభలో అడుగుపెడతానని ఎంపీ మొయిత్రా అన్నారు. ఎథిక్స్ కమిటీ సిఫారసుపై ఆమె ఈ మేరకు స్పందించారు. 'మోదీ సర్కారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది' అని అన్నారు. ఏదేమైనా బీజేపీ-అదానీ వ్యవహారంపై తాను ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. ఎథిక్స్ కమిటీ విచారణపై మాట్లాడుతూ 'వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. అయినా నన్ను ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తిని క్రాస్-ఎగ్జామినేషన్ చేయలేదు. బహుమతులు అందాయన్న దానికి ఒక్క ఆధారమూ చూపలేదు' అని ఆమె అన్నారు.

ఎంపీగా తన హక్కులకు భంగం వాటిల్లిందంటూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు.

వచ్చే సమావేశాల్లో లోక్‌సభ ముందుకు

'ఓ ఎంపీని లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేయటం ఇదే మొదటిసారి' అని లోక్‌సభ మాజీ జనరల్ సెక్రటరీ పీడీటీ ఆచార్య అన్నారు. 'తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో నివేదికను ప్రవేశపెట్టే అవకాశముంది. దీనిపై ఓటింగ్ జరిపి సదరు ఎంపీపై కేంద్రం బహిష్కరణ వేటు వేయొచ్చు' అని ఆచార్య అభిప్రాయపడ్డారు.

ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు ప్రత్యేక బెంచ్‌లు

అత్యవసరమైతే తప్ప విచారణ వాయిదా వేయొద్దు

హైకోర్టులు, ప్రత్యేక కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, నవంబర్ 9: దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై నమోదైన 5000కు పైగా కేసుల విచారణను వేగవంతం చేసేలా పర్యవేక్షించేందుకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుచేయాలని సర్వోన్నత న్యాయస్థానం అన్ని హైకోర్టులను ఆదేశించింది. అరుదైన, తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ప్రజాప్రతినిధులపై కేసుల విచారణను వాయిదా వేయకూడదని కూడా సుప్రీంకోర్టు ప్రత్యేక కోర్టులను స్పష్టంచేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం గురువారం దేశంలోని అన్ని హైకోర్టులు, జిల్లా జడ్జీలు, ప్రజాప్రతినిధుల కేసులను విచారణ జరుపుతున్న ప్రత్యేక కోర్టులకు మార్గదర్శకాలు జారీచేసింది.

హైకోర్టులపైనే బాధ్యత

ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారానికి 'ఇన్ రీ డెసిగ్నేటెడ్ కోర్ట్స్ ఫర్ ఎంపీస్/ఎమ్మెల్యేస్' పేరుతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా ఒక కేసు నమోదు చేయాలని సూచించింది. అనేకమైన స్థానిక అంశాల కారణంగా.. దేశవ్యాప్తంగా ఉన్న ట్రయల్ కోర్టులకు తాము ప్రామాణికమైన మార్గదర్శకాలను రూపొందించలేకపోతున్నామని తెలిపింది. అందువల్ల ఈ అంశాన్ని ట్రయల్ కోర్టులపై పర్యవేక్షక అధికారం ఉన్న హైకోర్టులపై పెడుతున్నామని పేర్కొంది. ట్రయల్ కోర్టులు, జిల్లా/సెషన్స్ కోర్టులపై ఒత్తిడి తెచ్చి ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసుల విచారణను హైకోర్టులు వేగవంతం చేయాలని ఆదేశించింది.

మరణశిక్ష, యావజ్జీవ శిక్ష విధించదగ్గ కేసులకు ప్రాధాన్యం

నిర్దేశిత కోర్టు ముందుగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన మరణశిక్ష లేదా యావజ్జీవ జైలు శిక్ష విధించదగిన కేసుల విచారణకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ తరువాత ఐదేండ్ల కన్నా ఎక్కువ కాలం జైలుశిక్ష పడే కేసులను చేపట్టాలని పేర్కొంది. గత ఏడాది నవంబర్ 14 నాటికి దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులపై 5,175 క్రిమినల్ కేసులు ఉన్నట్టు కోర్టు సహాయకుడు (అమికస్ క్యూరీ) న్యాయవాది విజయ్ హన్సారియా తెలిపారు. వీటిలో 2,116 కేసులు ఐదేండ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

రైల్వేలో అవినీతి!

10 మందిపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ, నవంబర్ 9: రైల్వేలో భారీ అవినీతి బయటపడింది. పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటున్నారంటూ ముంబయి రైల్వే యార్డ్, పార్సల్ విభాగాల్లో పనిచేస్తున్న 10 మంది రైల్వే అధికారులపై సీబీఐ కేసులు నమోదుచేసింది. రైల్వే విజిలెన్స్, సీబీఐ సంయుక్త సోదాల్లో లభించిన ఆధారాలతో ఈ చర్యలు చేపట్టినట్టు సీబీఐ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కుర్లా, సెంట్రల్ రైల్వే ముంబయి, లోకమాన్య టెర్మినస్‌లలో యార్డ్, పార్సల్ కేంద్రాల్లో పనిచేస్తున్న చీఫ్ పార్సల్ సూపర్‌వైజర్, చీఫ్ యార్డ్ మాస్టర్, డిప్యూటీ స్టేషన్ మేనేజర్.. మొదలైన అధికారులపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నది. ప్రైవేట్ ఏజెంట్స్ నుంచి రైల్వే అధికారులకు రూ.8 లక్షలు, రూ.5 లక్షలు లంచాలు అందినట్టు ఆధారాలు లభ్యమయ్యాయని తెలిపింది.

మాజీ నేవీ అధికారులకు మరణశిక్షపై అప్పీల్

న్యూఢిల్లీ, నవంబర్ 9: భారత నౌకాదళంలో పనిచేసిన 8 మంది మాజీ సిబ్బందికి ఖతర్‌లోని ఓ కోర్టు మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకిస్తూ అప్పీల్ దాఖలు చేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి బాగ్చీ చెప్పారు. గూఢచర్యం ఆరోపణలతో వీరికి మరణశిక్ష విధించినట్టు సమాచారమున్నదని తెలిపారు. ఈ కేసు నుంచి బయటపడేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

కిలో కూరగాయలతో వంద మందికి కూర

మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని ఆరోపిస్తూ గదగ్‌లో పాఠశాల ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అధ్వానంగా మధ్యాహ్న భోజనం

గదగ్‌లో విద్యార్థుల నిరసన..పాఠశాలకు తాళం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సంక్షేమ పథకాల అమలు అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదు. గదగ్ జిల్లా లక్కలకట్టి గ్రామంలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని, కిలో కూరగాయలను 100 మంది విద్యార్థులకు సరిపెడుతున్నారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పప్పు, కోడిగుడ్డు, కూరలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలి. కానీ 441 మంది విద్యార్థులకు 4 కిలోల కూరగాయలతో సాంబారు చేసి సరిపెడుతున్నారు. అంటే కిలో కూరగాయలను 100 మంది విద్యార్థులకు సరిపెట్టడం ఏమిటంటూ విద్యార్థులు రోడెక్కారు. నాణ్యత లేని భోజనం పెడుతున్నా ఉపాధ్యాయులు పట్టించుకోవటం లేదంటూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడిని వెంటనే బదిలీ చేయాలని అధికారులను కోరారు.

తెలంగాణలో చక్కగా అమలు

దేశంలో ఒకటి రెండు రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలు 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం 9, 10 తరగతుల వారికి కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇటీవల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా ఉదయం పూట టిఫిన్ కూడా అందిస్తున్నారు. మిగతా రాష్ట్రాల్లో దొడ్డు బియ్యం అన్నం పెడుతుండగా, తెలంగాణలో సన్న బియ్యం అన్నం పెడుతున్నారు. భోజనంలో అరటి పండ్లు, కోడిగుడ్డు (వారానికి 3 సార్లు), లేత మొలకలు, రాగి జావ అందిస్తున్నారు. అంతేగాకుండా పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, రెండు జతల యూనిఫామ్‌లను కూడా ఉచితంగా అందిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా లాభం లేదు

నాణ్యత లేని భోజనం పెడుతుండటంతో నేను పాఠశాలకు వెళ్లి టీచర్‌తో మాట్లాడాను. అయినా ఎలాంటి ఫలితం లేదు. నాసిరకం భోజనమే పెడుతున్నారు. దీంతో పిల్లలు ఆ భోజనాన్ని తినటం లేదు.

-ప్రదీప్ లమాని, విద్యార్థి తండ్రి

జస్టిస్‌లు సతీశ్ చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మసీహ్, సందీప్ మెహతా

సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

ప్రమాణస్వీకారం చేయించిన సీజేఐ

న్యూఢిల్లీ, నవంబర్ 9: ఢిల్లీ, రాజస్థాన్, గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు సతీశ్ చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మసీహ్, సందీప్ మెహతాలతో సీజేఐ చంద్రచూడ్ గురువారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇతర జడ్జీలు, న్యాయవాదులు, కొత్తగా నియమితులైన జడ్జీల కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కొత్త జడ్జీల ప్రమాణ స్వీకారంతో అత్యున్నత న్యాయస్థానం తన పూర్తి సామర్థ్యమైన 34 మంది జడ్జీలతో పనిచేయనుంది. కొత్త జడ్జీల నియామకాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఎక్స్‌లో ప్రకటించారు. జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ 2008లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు జడ్జీగా నియమితులయ్యారు. 2021 అక్టోబర్ 11న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. 2022 జూన్ 28న ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయ్యారు. జస్టిస్ ఏజీ మసీహ్ 2008లో పంజాబ్-హర్యానా హైకోర్టు జడ్జీగా నియమితులయ్యారు. 2023 మే 30న రాజస్థాన్ హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. జస్టిస్ సందీప్ మెహతా 2011లో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 ఫిబ్రవరి 15న గువాహటి హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

గవర్నర్‌పై మరోసారి సుప్రీంకు కేరళ

న్యూఢిల్లీ, నవంబర్ 9: కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ కేరళ ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. బిల్లులపై సంతకం పెట్టడానికి నిర్దిష్ట గడువు విధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేరళ హైకోర్టు తిరస్కరించిందని, దీనిపై స్పష్టతనివ్వాలని తాజాగా కోరింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై రాజ్యాంగం ప్రకారం గవర్నర్ సంతకం చేయాలని, కానీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ బిల్లులను తొక్కిపెడుతున్నారని తెలిపింది. కాగా, గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును కేరళ ప్రభుత్వం ఆశ్రయించడం ఈ నెలలో ఇది రెండోసారి.



సీఈవో ప్రాణాలు నిలిపిన స్మార్ట్‌వాచ్!

న్యూఢిల్లీ: స్మార్ట్‌వాచ్.. యూజర్ల ప్రాణాలు కాపాడిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఈసారి యూకేలో ఓ కంపెనీ సీఈవో ప్రాణాలు నిలబెట్టింది. హాకీవేల్స్ కంపెనీ సీఈవో పాల్ వాఫమ్ (42) స్వాన్‌సీ ప్రాంతంలోని మోరిస్టోన్‌లో తన ఇంటి సమీపంలో ఉదయం రన్నింగ్ చేస్తుండగా ఛాతీ నొప్పితో విలవిల్లాడిపోయాడు. బాధను భరిస్తూనే తన స్మార్ట్‌వాచ్ నుంచి భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వెంటనే దవాఖానకి తరలించింది.



బెంగళూరులో చెత్తలో నోట్ల కట్టలు లభ్యం

బెంగళూరు: బెంగళూరులో చెత్తలో కట్టల కట్టల నోట్లు దర్శనమిచ్చాయి. సల్మాన్ ఖాన్ అనే చెత్త ఏరుకునే వ్యక్తికి రూ.25 కోట్ల విలువైన 23 కట్టల అమెరికా డాలర్లు లభించాయి. దీంతో వాటిని తీసి తన దగ్గరే దాచాడు. అయితే అవి ఏం నోట్లో అతనికి అర్థం కాలేదు. దీంతో ఖాన్ ఈ నెల 5న వాటిని తన యజమాని వద్దకు తీసుకెళ్లాడు. ఆయన పోలీస్ కమిషనర్‌కు వాటిని అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐ స్వతంత్ర సంస్థ!

దానిపై కేంద్రానికి నియంత్రణ లేదు.. సుప్రీంకోర్టుకు తెలిపిన మోదీ సర్కారు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేతలపైకి కేంద్ర దర్యాప్తు సంస్థను(సీబీఐని) ఉసిగొల్పుతున్నదని ఆరోపణలు ఎదుర్కొంటున్న మోదీ సర్కారు.. సుప్రీంకోర్టు ముందు కీలక వాదనలు చేసింది. సీబీఐ స్వతంత్ర సంస్థ అని, దానిపై కేంద్రానికి ఎలాంటి నియంత్రణ లేదని చెప్పుకొచ్చింది. రాష్ట్రం అనుమతి లేకుండానే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపడతున్నదని, ఇది రాష్ట్ర హక్కులను హరించడమేనని ఆరోపిస్తూ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించాలని కోరింది. రాష్ట్రంలో దర్యాప్తు, దాడులు చేపట్టడానికి సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని 2018 నవంబర్ 16న బెంగాల్ ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. అయినప్పటికీ సీబీఐ కేసులు నమోదు చేస్తున్నదని ఆరోపిస్తూ మమత సర్కారు ఆర్టికల్ 131కింద కేంద్రంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేంద్రంతో కానీ, ఇతర రాష్ట్రాలతో కానీ వివాదం తలెత్తినప్పుడు ఆర్టికల్ 131 ప్రకారం ఏదైనా రాష్ట్రం నేరుగా సుప్రీంకోర్టులో కేసు వేయొచ్చు. బెంగాల్ ప్రభుత్వం తరఫున న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం సీబీఐకి అనుమతి నిరాకరించిన తర్వాత ఎలాంటి దర్యాప్తు చేసే హక్కు దానికి లేదని అన్నారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ బెంగాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ యోగ్యం కాదన్నారు. ఆర్టికల్ 131 కింద సీబీఐపై కేసు దాఖలు చేయలేరు అని వాదించారు. ఈ ఆర్టికల్ రాష్ట్రాలు, కేంద్రం లేదా రాష్ట్రాలు, రాష్ట్రాల మధ్య వివాదాలకు సంబంధించినదన్నారు. సీబీఐ కేంద్రం పరిధిలోకి రాదన్నారు.



గద్దలు, రాబందులతో మృతదేహాల ఆచూకీ

జెరూసలేం: మృతదేహాలను పీక్కు తినే పక్షులను సైతం సైనిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నది ఇజ్రాయెల్. హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై జరిపిన దాడిలో వేలాది మంది మృతి చెందారు. ఇప్పటికీ చాలామంది మృతదేహాలు లభించడం లేదు. భద్రతా కారణాల వల్ల వాటిని వెతికించే పరిస్థితులు లేవు. అడవులు, కొండలు లాంటి ప్రదేశాలలో పడి ఉన్న మృతదేహాల ఆచూకీకి గద్దలు, రాబందులను ఇజ్రాయెల్ వినియోగిస్తున్నది.



2026కల్లా దేశంలో ఎయిర్ ట్యాక్సీ సేవలు!

న్యూఢిల్లీ, నవంబర్ 9: దేశంలో 2026 నాటికి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ సేవలను ప్రారంభిస్తామని ఇంటర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ గురువారం వెల్లడించింది. ఇండియాలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు ఈ సంస్థ భాగస్వామిగా ఉంది. ఈ ఈ-ఎయిర్‌క్రాఫ్ట్‌లో పైలట్‌తో పాటు నలుగురు ప్రయాణికులు కూర్చొనేందుకు అవకాశం ఉంటుంది. కారులో 60-90 నిమిషాలు పట్టే ప్రయాణాన్ని ఈ ఎయిర్ ట్యాక్సీ ద్వారా 7 నిమిషాల్లో పూర్తి చేయవచ్చు.